## క్లుప్తంగా

### సంఘం అభివృద్ధికి సహకరించండి



జిల్లా కోఆపరేటివ్ బ్యాంకు చైర్‌పర్సన్ విజయ మనోహరిని కలిసిన మల్లికార్జున

చిప్పగిరి: బెల్డోణ సహకార సంఘం అభివృద్ధికి సహకరించాలని జిల్లా కోఆపరేటివ్ చైర్‌పర్సన్ విజయ మనోహరిని ఆ సొసైటీ అధ్యక్షులు డేగులహాలు మల్లికార్జున మంగళవారం కలసి విజ్ఞప్తి చేశారు. బెల్డోణ సొసైటీలో 2,250 మంది ఖాతాదారులు, 1750 మంది రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారని, సంఘంలో రూ.23 కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయని వివరించారు. సంఘం నూతన భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. చైర్‌పర్సన్ విజయ మనోహరి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. సంఘం సీఈఓ హరికృష్ణ ఉన్నారు.

### సద్వినియోగం చేసుకోండి



భూమిపుత్ర సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాబార్డ్ డీడీఎం సుబ్బారెడ్డి

చిప్పగిరి: భూమి పుత్ర రైతు ఉత్పత్తిదారుల సేవా కేంద్రం అందించే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ డీడీఎం సుబ్బారెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం స్థానిక భూమిపుత్ర కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రైతులకు అందించే సేవలను అడిగి తెలుసుకున్నారు. సీఈఓ స్వర్ణలత, కంపెనీ డైరెక్టర్ గోవిందరాజులు, ఎఫర్డ్ కోఆర్డినేటర్ బానోదయ, రైతులు పాల్గొన్నారు.

### అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

నందవరం: గ్రామాల్లో అల్లర్లకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తిమ్మయ్య హెచ్చరించారు. మంగళవారం ముగతి గ్రామంలో ఎస్‌ఐ పల్లె విజిట్‌లో భాగంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. గొడవలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

### చొప్ప ట్రాక్టర్‌పై పడిన విద్యుత్ స్తంభం



చొప్ప ట్రాక్టర్‌పై విద్యుత్ స్తంభం పడడంతో మంటలంటుకుంటున్న దృశ్యం

హొళగుంద: స్థానిక దిడ్డి కాలనీలో మంగళవారం చొప్పతో వెళ్తున్న ట్రాక్టర్‌పై విద్యుత్ స్తంభం విరిగిపడడంతో నిప్పంటుకుని చొప్ప మొత్తం కాలిబూడిదైంది. గ్రామానికి చెందిన రైతు కూడ్లూరు రజాక్ జొన్నచొప్పను కొనుగోలుచేసి ట్రాక్టరులో తరలిస్తుండగా దిడ్డి కాలనీలో శీనప్ప బావి వద్ద రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభానికి తగలడంతో ట్రాక్టరుపై ఒరిగిపోయింది. విద్యుత్ తీగలు చొప్పపై పడి మంటలు వ్యాపించడంతో డ్రైవర్ ట్రాలీని అక్కడే వదిలేసి ఇంజన్‌తో ముందుకెళ్లాడు. స్థానికులు మంటలు ఆర్పేలోపే చొప్ప పూర్తిగా దగ్ధమైంది. రూ.50 వేల వరకు నష్టం జరిగిందని ఆదుకోవాలని బాధితుడు కోరారు.

### ఓటింగ్ పద్ధతిపై అవగాహన

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి, కుర్లేహళ్లి, బల్లోట గ్రామాల్లో ఈవీఎం ఓటింగ్ విధానంపై తహసీల్దార్ మల్లికార్జున ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈవీఎం ద్వారా ఓటు ఎలా వేయాలి, వీవీ ప్యాట్ స్లిప్ సరిచూసుకునే విధానాన్ని వివరించారు. జెడ్పీటీసీ లింగప్ప, జూనియర్ అసిస్టెంట్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### క్రీడాదుస్తుల పంపిణీ

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి హైస్కూల్‌లో మంగళవారం జెడ్పీటీసీ లింగప్ప చేతుల మీదుగా క్రీడాకారులకు సామగ్రి, దుస్తులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. మండలస్థాయి క్రీడల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఎంపీటీసీ గోపాల్ తదితరులు ఉన్నారు.

### షేక్ ఫాతిమాకు ఘన నివాళి

ఎమ్మిగనూరుటౌన్: భారతదేశంలో తొలి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయ్ పూలేతో పాటు కలిసి పనిచేసిన తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు షేక్‌ఫాతిమా జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఉర్దూ పాఠశాల ఆవరణలో ఆమె విగ్రహానికి బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మాదన్న, ఆదోని మండల ఉపాధ్యాయిని డి.హసీనా, షమామున్నీ పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ షేక్ ఫాతిమా విద్యాభివృద్ధికి చేసిన కృషిని వివరించారు.

# అక్కాచెల్లెమ్మలకు ఆసరా

- ఈ నెలాఖరులో నాలుగో విడత నగదు జమ
- 2019 నాటికి స్వయం సంఘాల రుణాలు రూ.51.68 కోట్లు
- మూడు విడతల్లో రూ.38.76 కోట్ల రుణమాఫీ చేసిన ప్రభుత్వం
- నియోజకవర్గంలో 2,714 స్వయం సహాయక సంఘాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



సమావేశంలో చర్చించుకుంటున్న స్వయం శక్తి సంఘం సభ్యులు (ఫైల్)

ఆలూరు రూరల్: ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పొదుపు సంఘాలకు రుణమాఫీ చేసి వారికి అండగా నిలిచారు. ఆలూరు నియోజకవర్గంలో 2,714 స్వయం శక్తి సంఘాలు 26,714 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికీ ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడు విడతల్లో రూ.38.76 కోట్లు రుణమాఫీ చేయడంతో అక్కచెల్లెమ్మల్లో ఆనందం వ్యక్తమవుతోంది. స్వయం సహాయక సంఘాల జీవనోపాధి మెరుగుపడడంతో పాటు గత ప్రభుత్వ హయాంలో బ్యాంకుల్లో బకాయి రుణాలను తిరిగి చెల్లించేందుకు వైఎస్సార్ ఆసరా పథకం దోహదపడింది. ఇందులో భాగంగా పట్టణ, గ్రామీణ స్వయం సహాయక మహిళలకు 2019 ఎన్నికల నాటికి బ్యాంకుల్లో ఉన్న రుణాలను ప్రభుత్వం నాలుగు విడతల్లో చెల్లిస్తోంది. ప్రతి మండలంలోని అన్ని స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో ఈ సొమ్మును ప్రతి ఏడాది నేరుగా వారి ఖాతాల్లో జమచేస్తోంది.

| | |
|---|---|
| నియోజకవర్గం | ఆలూరు |
| మండలాలు | 6 |
| స్వయం శక్తి సంఘాలు | 2,714 |
| సభ్యులు | 6,111 |
| మూడు విడతల్లో రుణమాఫీ చేసిన నగదు | రూ.38.76 కోట్లు |

**మూడు విడతల్లో రూ.38.76 కోట్లు జమ**

గత ప్రభుత్వం హయాంలో పొదుపు సంఘాలలో జరిగిన అవకతవకలను వెలికితీసి పారదర్శకంగా అన్ని గ్రూపులకు రుణాలు అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. నియోజకవర్గంలో 2019 నాటికి పొదుపు సంఘాలకు రూ.51.68 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఆలూరు మండలంలో 662 గ్రూపులు ఉన్నాయి. వీరికి రూ.12.17 కోట్ల రుణాలు అందించారు. ఆస్పరి మండలంలో 384 గ్రూపులకు రూ.6.35 కోట్లు, చిప్పగిరి మండలంలో 464 గ్రూపులు ఉండగా వీరికి రూ.11.99 కోట్లు, హాలహర్వి మండలంలోని 419 గ్రూపులకు రూ.10.84 కోట్ల రుణాలు, హొళగుంద మండలంలో 199 పొదుపు సంఘాల గ్రూపులకు రూ.2.61 కోట్లు, దేవనకొండ మండలంలో 627 సంఘాలు ఉన్నాయి. వీరికి రూ.7.72 కోట్ల రుణాలు అందించినట్లు అధికారులు తెలియజేశారు. రుణాలు పొంది స్వయం ఉపాధి చేసుకొకుంటూ జీవనం కొనసాగించే సంఘాల సభ్యులు ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ వైఎస్సార్ ఆసరా పథకంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.



స్వయం శక్తి సంఘం కింద పొందిన గేదెలను చూపుతున్న సభ్యురాలు అస్లం బీ

**జీవనోపాధి మెరుగుపడింది**

ఈ ప్రభుత్వం మాకు అంతా మంచిగా చేసింది. గతంలో ఎన్నడూ ఇలాంటి ఆర్థిక చేయూత అందలేదు. పొదుపు సంఘం నుంచి వచ్చే రుణం తీసుకుని బర్రెలు కొన్నాను. పాలు అమ్మి జీవనం సాగిస్తున్నాను. ఈ నాలుగేళ్లలో నా జీవనోపాధి మెరుగుపడింది.

– అస్లం బీ, పొదుపు సంఘం సభ్యురాలు

**రుణపడి ఉంటా**



నా భర్త వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. జగనన్న ఇచ్చిన మాట ప్రకారం మూడు విడతల్లో మా సాయి చైతన్య పొదుపు గ్రూపునకు నగదు జమ చేశారు. ఆ డబ్బుతో ఇంటిల్లిపాది చక్కబెట్టుకున్నాను. అరకొర అప్పులు తీర్చుకుని మా జీవనోపాధి మెరుగపరచుకున్నాం. పొదుపు సంఘాలకు జీవం పోసిన ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటా.

– శారదమ్మ, సాయి చైతన్య గ్రూపు, ఆలూరు,

**నెలాఖరులోగా నాలుగో విడత నగదు**



ఆలూరు ఏరియా పరిధిలోని అన్ని పొదుపు సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రతి ఒక్క గ్రూపునకు అందించేందుకు చర్యలు తీసుకుంటాం. గత మూడేళ్లలో అర్హులైన సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిచాం. మూడు విడతల్లో రూ.38.76 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశాం. నాలుగో విడతలో భాగంగా ఈ నెలాఖరులో వారి అకౌంట్లో మిగతా రూ.12.92 కోట్ల నగదు జమ కానుంది.

– ఏరియా కో–ఆర్డినేటర్, ఆలూరు

### నేడు కేంద్ర మంత్రి రాక

నందవరం: మండల కేంద్రంలో బుధవారం నిర్వహించే వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు కేంద్ర మంత్రి సత్యపాల్ సింగ్ బఘేల్ రానున్నట్లు ఎంపీడీఓ దశరథ రామయ్య తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ సృజన హాజరు కానునట్లు వివరించారు. మండల అధికారులు, సచివాలయ సిబ్బంది తప్పని సరి హాజరు కావాలని సూచించారు. సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### ఎంటీఎస్ విధానం వద్దు

ఎమ్మిగనూరుటౌన్: ఉపాధ్యాయ నియామకాల్లో ఎంటీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోట్ల చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు కరెక్ష్ణ కోరారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో మండల డీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షులుగా చిన్ని వీరేష్, ఉపాధ్యక్షులుగా మధుసుదన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, కవిత, రూపావతి, ప్రధాన కార్యదర్శిగా కిరణ్‌కుమార్, పలువురు కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లను ఎన్నుకున్నారు.

### మద్దతు ధరకు కందుల కొనుగోలు

మద్దికెర: రైతులు పండించిన కందులను ప్రభుత్వమే నాఫెడ్ ద్వారా మార్కెట్ ధరకు కొనుగోలు చేస్తుందని ఏఓ రవి అన్నారు. మంగళవారం మద్దికెరలో రైతులకు కందుల విక్రయంపై అవగాహన కల్పించారు. కందులను విక్రయించదలచిన వారు సమీపంలోని రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. విక్రయం అనంతరం నగదు వారం రోజుల్లోగా రైతు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందన్నారు.

## అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: సామాజిక న్యాయం, సాధికారత కోసం కృషిచేసిన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహ ఆవిష్కరణ ఈనెల 19వ తేదీన విజయవాడలోని స్వరాజ్ మైదానంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరగనున్నట్లు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. మంగళవారం పత్తికొండ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 5 మండలాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విజయవాడలోని స్వరాజ్ మైదానంలో 19 ఎకరాల విస్తీర్ణంలో రూ.404 కోట్లతో అంబేడ్కర్ 125 అడుగుల భారీ విగ్రహం, స్మృతివనం ఏర్పాటు చేశారన్నారు. ఈ నెల 19న స్మృతివనం ప్రారంభోత్సవానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలి వెళ్దామని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. మార్కెట్‌కమిటీ చైర్మన్ పక్కీరప్ప, నాయకులు గుంతాదేవి, సుంకన్న, పులికొండ నాయక్, నారాయణదాసు, శ్రీరంగడు, సోమశేఖర్, భాస్కర్‌నాయక్, ఖాజావలి, తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర: స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, సర్పంచ్ సుహాసిని ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి భారీగా ప్రజలు తరలివెళ్లి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కృష్ణగిరి: మండలంలోని అన్ని సచివాలయాల్లో మంగళవారం ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ నెల 19 విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మండల ప్రజలు తరలివెళ్లి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అమకతాడు సర్పంచ్ బోయ సర్వేశ్వరి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

### నేడు బహిరంగ వేలం

కృష్ణగిరి: మండల పరిధిలోని హంద్రీ – నీవా రిజ ర్వాయర్‌లో చేపల పెంపకం హక్కులకు సంబంధించి బుధవారం స్థానిక సచివాలయంలో ఉద యం 10 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు గాజులదిన్నె ప్రాజెక్టు మత్స్య శాఖ అధికారి చంద్రయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా రూ.10 వేల డిపాజిట్ చేసి పేరు నమోదు చేసుకోవాలన్నారు. హక్కు దక్కించుకున్న వారు వెంటనే డబ్బు చెల్లించి రశీదు పొందాలన్నారు.

### గర్భిణులకు భోజన సదుపాయం

పత్తికొండ రూరల్: పత్తికొండ పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి మంగళవారం స్కానింగ్ పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులు, వారి వెంట వచ్చిన సహాయకులు 250 మందికి వైఎస్సార్‌సీపీ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి భోజన సదుపాయం కల్పించారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ కల్పన చేతుల మీదుగా భోజనం వడ్డించి ప్రారంభించారు. ఎంపీటీసీ దేవరగట్టు లక్ష్మి, అనిత, నెనావత్ సరోజ, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

### అయోధ్య అక్షింతల పంపిణీ

తుగ్గలి: శ్రీరామ నామ భజనలతో అయోధ్య అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం తుగ్గలిలో నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భజన బృందం సభ్యులు భజన కీర్తనలతో ఇంటింటికీ వెళ్లి రామ మందిర ప్రారంభోత్సవ కరపత్రాలు, అక్షింతలు అందజేశారు. ఈ నెల 22న అయో ధ్యలో నిర్వహించే శ్రీరాముని ప్రతిష్ట సందర్భంగా స్థానిక ఆలయాల్లో నిర్వహించే ప్రత్యేక పూజల్లో పాల్గొనాలని సూచించారు.

మద్దికెర: ఇంటింటికీ అయోధ్య అక్షింతలు అందిస్తామని చౌడేశ్వరి దేవాలయ చైర్మన్ రమేష్ మంగళవారం తెలిపారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలకు దేవాయలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వెంకటేశులు, భక్తులు సూరి, ఉమాపతి పాల్గొన్నారు.

### నేటి నుంచి మండలస్థాయి పోటీలు

ఆస్పరి: 'ఆడుదాం – ఆంధ్ర' కార్యక్రమంలో బుధవారం నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు. మొదటి రోజు కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. క్రీడాకారులు పోటీల్లో పాల్గొని సత్తా చాటాలన్నారు.

## వైఎస్సార్‌సీపీతోనే బీసీలకు గుర్తింపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోనే బీసీలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి ఎమ్మెల్యే సీట్లు కేటాయించారని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మాచాని వెంకటేష్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే నివాసంలో.. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, సచివాలయ కన్వినర్లు పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మిగనూరు చరిత్రలో బీసీలకు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం లేదని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు ప్రాధాన్యతనిస్తూ తన సూచన మేరకే మాచాని వెంకటేష్‌ను సమన్వయకర్తగా ప్రకటించారన్నారు తాను బలపరిచిన అభ్యర్థికి పార్టీ శ్రేణులంతా మద్దతుగా నిలవాలని, మళ్లీ ఎమ్మిగనూరులో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసేందుకు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. వై.ఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మాచాని వెంకటేష్, సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, బుట్టారంగయ్య, రియాజ్‌అహమ్మద్, బీఆర్ బసిరెడ్డి, నజీర్‌అహమ్మద్, యుకె రాజశేఖర్, బంగి శ్రీరాం, షబ్బీర్‌అహమ్మద్, అన్నపూర్ణమ్మ ప్రసంగించగా కౌన్సిలర్లు, వార్డు ఇంచార్జ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఈఆర్వో మల్లికార్జున

ఆలూరు రూరల్: ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకమని ఆలూరు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి మల్లికార్జున అన్నారు. మంగళవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని మండలాల తహసీల్దార్లు, పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లుతో పాటు 32 మంది సెక్టోరియల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 294 పోలింగ్ కేంద్రాల నిర్వహణ, ఆ కేంద్రాల్లో కనీస వసతుల కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియ జరిగే మూడు రోజులపాటు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లను ప్రభావితం చేయడం, ఓటు వేసే వారికి ఇబ్బంది కలిగించే వారిపై నిఘా ఉంచాలన్నారు. ప్రతి సెక్టోరల్ అధికారికి ఓ పోలీసు సెక్టోరల్ అధికారిని నియమించడం జరిగిందన్నారు. జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి పోలింగ్ కేంద్రాల బీఎల్‌ఓల వరకు కమ్యూనికేషన్ ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే ప్రతి పోలింగ్ కేంద్రానికి ర్యాంపులు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి సౌకర్యంతో పాటు వివిధ రకాల సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తామన్నారు. ఓటర్లందరూ ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్లు రామాంజనేయులు, హుసేన్ సాహెబ్, మల్లికార్జున, కుమార స్వామి, వెంకటేష్ నాయక్, లక్ష్మినారాయణ ఎన్నికల డీటీ గుండాల్‌నాయక్ అన్ని మండలాల ఎస్ఐలు ఉన్నారు.

### ముమ్మరంగా పింఛన్ల పంపిణీ

ఆస్పరి: మండలంలోని గ్రామాలలో కొత్త పింఛన్ల పంపిణీ ముమ్మరంగా జరుగుతున్నట్లు ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు. మంగళవారం ఆస్పరిలో ఆమె మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటివరకు 85 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. 7245 పింఛన్లకు గాను ఇప్పటి వరకు 6158 మందికి సొమ్ము పంపిణీ చేశామని రెండు రోజుల్లో వంద శాతం పూర్తి చేస్తామని చెప్పారు. మండలంలోని శంకరబండ గ్రామ సచివాలయంలో మంగళవారం ఆరుగురికి కొత్తగా మంజూరైన పింఛన్లను సర్పంచ్ విజయలక్ష్మి పంపిణీ చేశారు.

దేవనకొండ: మండలంలోని తెర్నేకల్ గ్రామంలో కొత్త పింఛన్లను సర్పంచ్ ఎం.అరుణ్‌కుమార్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రకారం పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచారన్నారు. అలాగే కొత్తగా 31 మందికి పింఛన్లు మంజూరైనట్లు చెప్పారు.ఎంపీటీసీ నామాల శ్రీను, బెల్ ఈరన్న, చాప ఈరన్న, పంచాయతీ కార్యదర్శి సునీత తదితరులు ఉన్నారు.



శంకరబండలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి



దేవనకొండలో పింఛన్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ అరుణ్‌కుమార్

### కుంకనూరులో చోరీ

దేవనకొండ: మండలంలోని కుంకనూరు గ్రామంలో తలారి శేఖర్ ఇంట్లో చోరీ జరిగింది. వివరాలు.. తలారి శేఖర్, కుటుంబ సభ్యులు బతుకుదెరువు కోసం నెల రోజుల క్రితం వలస వెళ్లారు. తిరిగి సోమవారం కుంకనూరు గ్రామానికి చేరుకుని ఇంటికి రాగా, బీరువాలో ఉంచిన నాలుగు తులాల బంగారం, రూ.1.80 లక్షలు కనిపించడం లేదని వాపోయారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ భూపాలుడు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## ప్రజారోగ్యానికి 'జగనన్న సురక్ష'



పెద్దనేలటూర్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



మాచాపురంలో చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్

గోనెగండ్ల: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా మంగళవారం పెద్దనేలటూర్ గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు కార్తీక్, సాయిప్రియాంక, వినయ్ బాబు సింధూర 302 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ సోమన్న, ఎంపీటీసీ లోక్‌నాథ్ రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నందవరం: మండల పరిధిలోని మాచాపురం గ్రామంలో సర్పంచ్ కిష్టప్ప ఆధ్వర్యంలో సురక్ష రెండవ విడత క్యాంపు నిర్వహించారు. శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు 282 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు రేవతి, రోహిత్, మహేంద్ర, సీహెచ్‌ఓ బలరాం, తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: ఉప్పర్లపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ ప్రభాకరరెడ్డి ప్రారంభించారు. శిబిరంలో 220 మంది వైద్య సేవలు పొందారు. డాక్టరు వారికి 14 రకాల ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ మినాజ్‌పాషా, శిరీష వైద్య సేవలందించారు.

మద్దికెర: మండల పరిధిలోని పెరవలిలో సర్పంచ్ మల్లికార్జున, ప్రభుత్వ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణి ఆధ్వర్యంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈఓ సుధాకర్, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

హాలహర్వి: మండలంలోని బేవినహాల్ గ్రామంలో సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ ఆంతోనీ, వైస్ ఎంపీపీ నగేష్, సర్పంచ్ బసవరాజుగౌడ్ పర్యవేక్షించారు. వైద్యులు మన్సూర్‌వలీ, సిబ్బంది రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు.



బేవినహాల్‌లో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్



పెరవలిలో మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఈఓ

## రాష్ట్ర భవిష్యత్తు మార్చిన 'ప్రజా సంకల్ప యాత్ర'



పత్తికొండలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పార్టీ నాయకులు



ఎమ్మిగనూరులో కేక్‌కట్ చేస్తున్న ఎర్రకోట జగన్, సమన్వయకర్త మాచాని వెంకటేష్



హాలహర్విలో సీఎం వైఎస్ జగన్, మంత్రి జయరాం ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

పత్తికొండటౌన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ప్రజాసంకల్ప పాదయాత్ర ముగిసి 5 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం పత్తికొండలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలసి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కేక్ కట్‌చేశారు. అంతకు ముందు ముస్లిం, మైనార్టీ నాయకులు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రతో ప్రజల కష్టాలను కళ్లారా చూసిన వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక సంక్షేమ పథకాల ద్వారా ప్రతిఒక్కరినీ ఆదుకున్నారన్నారు.జగనన్న మళ్లీ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగుతాయన్నారు. నాయకులు పక్కీరప్ప, గుంతాదేవి, సుంకన్న, పులికొండ నాయక్, నారాయణదాసు, శ్రీరంగడు, సోమశేఖర్, భాస్కర్‌నాయక్, ఖాజావలి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: ఎన్నికల ముందు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర నేడు రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలతో పాటు అన్ని వర్గాలు అభ్యున్నతి సాధించేందుకు దోహదపడిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సంకల్ప యాత్ర ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త మాచాని వెంకటేష్, పార్టీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్యలతో కలిసి పట్టణంలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రియాజ్‌అహమ్మద్, యుకె రాజశేఖర్, షబ్బీర్‌అహమ్మద్, సునీల్‌కుమార్, వీరేంద్ర, బంగిశ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

హాలహర్వి: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర ముగిసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా హాలహర్విలో జెడ్పీటీసీ లింగప్ప, మండల కన్వీనర్ భీమప్పచౌదరి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి గుమ్మనూరు జయరాం ఫ్లెక్సీలకు పాలాభిషేకం నిర్వహించారు. స్వీట్లు పంచుకుని హర్షం వ్యక్తం చేశారు. ఎంపీటీసీలు రామకృష్ణ, గోపాల్, గాదిలింగప్ప, సర్పంచులు బాపురం నాఎంద్ర, మారెన్న, ఉలిగప్ప, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.